సాక్షి
పల్నాడు

బుధవారం । 1 । జనవరి । 2025



ఐ లవ్ సత్తెనపల్లి

సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్‌లో విద్యుత్ దీపాలతో ఐ లవ్ సత్తెనపల్లి అంటూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం రాత్రి అలంకరించారు.



న్యాయశాఖ క్యాలెండర్ ఆవిష్కరణ

నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలోని డీజే హాల్‌లో న్యాయశాఖ నూతన క్యాలెండర్‌ను మంగళ వారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ.పార్థసారథి ఆవిష్కరించారు.



ఆలయానికి రూ.లక్ష విరాళం

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం అభివృద్ధికి కందుల శ్రీని వాసరావు, మాధవి దంపతులు రూ.లక్ష సోమవారం అందజేశారు.







నూతన సంవత్సర సందడి

2024కు వీడ్కోలు పలుకుతూ 2025కు స్వాగతం పలుకుతూ పల్నాడు జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. నరసరావుపేట పట్టణంలోని పలు ఆలయాలు, ప్రార్థన మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రార్థనాలయాలలో ప్రార్థనలు చేశారు. పలు స్వీట్ షాపులు కిటకిటలాడాయి. అర్ధరాత్రి 12 గంటల తర్వాత యువత వీధులలోకి వచ్చి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేరింతలు కొట్టారు. స్వీట్లు పంచుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

రేంజ్‌లో 63 మంది సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు జాబితాను సిద్ధం చేశారు. వారం రోజుల కిందట ఈ జాబితాను సిద్ధం చేయగా, 63 మంది సీఐలు ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. సీఐలు కె.వేమారెడ్డి, బెల్లం శ్రీనివాసరావు, ఎస్‌వి.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసుల రెడ్డి, డివి.చౌదరి, ఎన్.శ్రీకాంత్‌బాబు, ఎస్.అంటోనిరాజు, ఎం.లక్ష్మణ్, బత్తుల శ్రీనివాస రావు, ఐ.శ్రీనివా సన్, బి.రమేష్‌బాబు, ఎ.అశోక్‌కుమార్, కొంకా శ్రీనివాసరావు, ఏవీ.రమణ, ఎం.హైమారావు, షేక్. కరిముల్లాషావలి, యూవీ.శోభన్‌బాబుతోపాటు పలువురు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతిలో ఉన్నారు.

జిల్లాలో 95.32శాతం పింఛన్ల పంపిణీ



నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంగళవారం జరిగింది. సాయంత్రం 6.25గంటలకు 95.32శాతం పంపిణీ పూర్తిచేశారు. జనవరి ఒకటో తేదీన సెలవు దినం కావటంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే జిల్లా వ్యాప్తంగా పంపిణీని అధికారులు ప్రారంభించారు. జనవరి నెల లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ ప్రారంభానికి స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నరసరావుపేట మండలంలోని యలమంద గ్రామంలో పర్యటించి రెండు కుటుంబాల వారికి స్వయంగా పింఛన్ అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 2,73,530 మందికి రూ.117,74,14,500 అందజేయాల్సి ఉండగా వారిలో 2,60,995 మందికి రూ.112,03,04,000 పంపిణీ చేశారు. ప్రతిచోటా స్థానిక టీడీపీ నాయకులు పంపిణీలో భాగస్వాములయ్యారు. ఎక్కువ భాగం లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందజేశారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. చిన్న జీయర్ స్వామిజీ భక్తులకు ప్రవచనాలు అందజేస్తున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామిజీ ప్రజలందరూ ఈ సంవత్సరంలో ఆనందోత్సవాలతో జీవించాలని కోరారు.

మెరిట్ జాబితాపై అభ్యంతరాలకు అవకాశం

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి మెరిట్ జాబితాను విడుదల చేశారు. ఈ మేరకు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక , సవరించిన మెరిట్ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తగిన ధ్రువపత్రాలతో జనవరి 1 నుంచి 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు వైద్య కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మెరిట్ జాబితా కోసం గుంటూరు.ఏపీ.జీవో వీ.ఇన్, గుంటూరు మెడికల్ కాలేజీ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లలో చూడాలని సూచించారు.

యార్డుకు 58,387 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 58,387 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 53,319 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 16,300 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 51,513 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

800మంది జనం..
1120మంది పోలీసులు

- అడుగడుగునా పోలీసు ఆంక్షలు
- 70 నిమిషాలు సాగిన ముఖ్యమంత్రి ప్రసంగం
- మధ్యలోనే బయటకు వెళ్లిపోయిన మహిళలు, వృద్ధులు
- నేను సాదాసీదా సీఎం అంటూ డాబు

యల్లమందలో సీఎం చంద్రబాబు పర్యటన



సభలో నుంచి మధ్యలో వెళ్లిపోతున్న మహిళలు

నరసరావుపేటరూరల్: సీఎం చంద్రబాబు పల్నాడు జిల్లా పర్యటన హంగూ, ఆర్భాటాలతో సాగింది. ఇద్దరు పెన్షన్ లబ్ధిదారులకు పింఛన్ అందించేందుకు కోట్లాది రూపాయలను ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి బయటకు వస్తే పరదాలు కట్టే వారని ఎద్దేవా చేసే సీఎం చంద్రబాబు యల్లమంద పర్యటనలో మాత్రం 800 మంది పాల్గొనే అవకాశం ఉన్న సభ కోసం 1120 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు కల్పించారు. సోమవారం నుంచే వందలాది మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం గ్రామానికి రప్పించారు. మంగళవారం ఉదయం నుంచి ప్రధాన వీధుల్లో పోలీసుల హడావుడే కనిపించింది. లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ కోసం గ్రామంలోని ఇద్దరి గృహాలకు సీఎం చంద్రబాబు వెళ్లారు. సీఎం రాక ముందే ఆ గృహాల సమీపంలోకి సామాన్యులను అనుమతించలేదు. ఎక్కడికక్కడ బారికేడ్‌లు ఏర్పాటుచేశారు. ప్రధాన రోడ్డులోని లబ్ధిదారుడి ఇంటి ఎదురుగా నివసించే వారిని కూడా బయట ఉండవద్దని పోలీసులు ఆంక్షలు విధించారు. తమ గ్రామానికి ముఖ్యమంత్రి వస్తుంటే చూసే అవకాశం కూడా ఇవ్వరా అంటూ వారు పోలీసులను ప్రశ్నించడం వినిపించింది. ఇతర గ్రామాల వారు యల్లమందకు రాకుండా ఎక్కడికక్కడ చెక్‌పోస్ట్‌లు ఏర్పాటుచేశారు. చంద్రబాబు తన ప్రసంగంలో తాను సాదాసీదా సీఎం అని చెప్పడం గమనార్హం.

ఉకదంపుడు ఉపన్యాసం

యల్లమంద గ్రామంలో సీఎం చంద్రబాబు ప్రసంగం సభకు హాజరైన ప్రజలకు చిరాకు తెప్పించింది. దాదాపు గంట ఆలస్యంగా సభకు వచ్చిన చంద్రబాబు తన ప్రసంగాన్ని గంటకు పైగా కొనసాగించారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12.45కు సభ ముగించాల్సి ఉండగా రెండు గంటలు ఆలస్యంగా 2.45కు సభ పూర్తయింది. దీంతో చంద్రబాబు మాట్లాడుతుండగానే మహిళలు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. కొంత సేపటికి బయటకు వెళ్లే వారి సంఖ్య పెరిగి వారు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గి వారిని బయటకు వెళ్లేందుకు అడ్డుకున్నారు. సభలో నుంచి ఏవరూ బయటకు వెళ్లకుండా చేసే బాధ్యతను వెలుగు సిబ్బంది నిర్వహించారు. మహిళలు కుర్చీలో నుంచి నిలబడగానే వారు వెళ్లి బలవంతంగా కూర్చోబెట్టడం కనిపించింది.



యల్లమందలో పోలీసు బందోబస్తు



సీఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన వ్యక్తిని అడ్డుకుంటున్న పోలీసులు

సివిల్ కేసులో పోలీసుల అత్యుత్సాహం

- కోర్టు ఉత్తర్వులను ధిక్కరించిన పోలీసులు
- ఇంటిని ఆక్రమించుకుంటున్న వ్యక్తికి అన్నివిధాలా అండ
- దౌర్జన్యంగా ఇంటి ఆక్రమణకు అధికార పార్టీ నేత యత్నం
- పోలీసులు జోక్యం చేసుకోవద్దన్న హైకోర్టు ఆదేశాలూ బేఖాతర్



వజ్రకుమారిని బయటకు రావాలని టీడీపీ నాయకుడు విజయ్‌కిరణ్ దౌర్జన్యం చేస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: సివిల్ వివాదంలో ఉన్న ఇంటిని ఆక్రమించుకునే యత్నం చేస్తున్న అధికార పార్టీ నాయకుడికి పట్టాభిపురం పోలీసులు అండగా నిలిచారు. సాయిబాబా రోడ్డు ప్రశాంతి నగర్ 2వ లైన్‌లో డిప్యూటీ మేయర్ వనమా వజ్రబాబు సోదరి వజ్రకుమారి అద్దెకు ఉంటున్న ఇంటికి సంబంధించి సివిల్ వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోర్టు సివిల్ వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోవద్దని చెప్పినప్పటికీ ఆ ఆదేశాలను ధిక్కరించి మరీ పోలీసులు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నాయకుడికి వత్తాసు పలుకుతున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు వజ్ర కుమారి తెలిపిన వివరాల ప్రకారం.... '' 2008వ సంవత్సరం నుంచి సాయిబాబా రోడ్డు ప్రశాంతి నగర్ 2వ లైన్‌లోని ఇంట్లో అద్దెకు ఉంటున్నాం. ఈ ఇంటికి సంబంధించి సివిల్ వివాదం నడుస్తోంది. ఇదే ఇంట్లో నా భర్త కూడా అనారోగ్య కారణంగా కన్నుమూశారు. నా ఇద్దరు సంతానానికి కూడా ఇదే నివాసంలో వివాహం చేశా. నా తమ్ముడు డైమండ్ బాబు వైఎస్ఆర్ సీపీలో కీలక పాత్ర పోషిస్తూ ఉండటం, నగర డిప్యూటీ మేయర్‌గా ఉన్నారని అధికార పార్టీ తెలుగు యువత అధికార ప్రతినిధి అయిన యనమల విజయ్‌కిరణ్ అనే వ్యక్తి బలవంతంగా ఈ ఇంటిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నాడు. మా ఇంటిపై డిసెంబర్ 22వ తేదీన అనుచరులతో వచ్చి మహిళలు, చిన్నారులు అని కూడా చూడకుండా బయటకు గెంటేశాడు. వారి అనుచరులను అదే ఇంట్లో పెట్టి చాలా పెద్ద గొడవకు దిగాడు. ఆ సమయంలో పట్టాభిపురం సీఐ వీరేంద్ర కూడా మా సోదరుడైన డైమండ్ బాబు పట్ల దురుసుగా వ్యవహరించారు. బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించగా, జిల్లా ఎస్పీ జోక్యం చేసుకోవడంతో వదిలిపెట్టారు. పోలీసులు ఆ రోజు కూడా మమ్మల్ని లోపలికి రానివ్వకుండా కిరణ్‌కు పూర్తి మద్దతుగా నిలిచారు. అదే తరహాలో మంగళవారం స్వయంగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్ నుంచి ఎస్సై, ఏఎస్సై వచ్చి ఇంట్లో ఉన్న మమ్మల్ని గట్టిగా కేకలు వేసి బయటకు రావాలని బెదిరించారు. ఇదేంటని ప్రశ్నించిన నా కుమారుడు, కోడలు పట్ల దురుసుగా వ్యవహరించారు. కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్న తనను కూడా ఇంట్లో నుంచి బయటకు రావాల్సిందిగా పోలీసులు హెచ్చరించారు. బయటకు పంపించే యత్నం చేశారు. విజయ్‌కిరణ్ ఈ ఇంటిని ఆక్రమించుకోవాలని అనుచరులతో ఇంటి తలుపులు బద్దలు కొట్టి మమ్మల్ని బయటకు లాగుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ ఏఎస్సై అయితే లోపలికి వచ్చి మా ముందు టిఫిన్ తింటూ బెదిరించే ప్రయత్నం చేశారు.

ఆక్రమణదారులకు సీఐ అండ

వజ్రకుమారి కుటుంబాన్ని బయటకు పంపేందుకు అనుచరగణంతో వచ్చిన యనమల విజయ్‌కిరణ్‌కు పట్టాభిపురం సీఐ, సిబ్బంది పూర్తి అండగా నిలిచారు. అనుచరులతో ఆక్రమణకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. 2008 నుంచి అద్దెకు ఉంటున్న వారి పట్ల దురుసుగా ప్రవర్తించి అధికార పార్టీ నాయకుల మెప్పు పొందే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. సివిల్ వివాదంలో ఉన్న ఇంటిని ఆక్రమించుకునేందుకు పథకం రచించిన విజయ్‌కిరణ్‌కు పట్టాభిపురం సీఐ అండగా ఉన్నారని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆక్రమించుకునేందుకు యత్నించిన కిరణ్, అతని అనుచరులను ఏమీ అనకపోవడం గమనించాల్సిన విషయం. పైగా వజ్రకుమారి, ఆమె కుమారుడు, కోడలు, కుమార్తె, మనవరాలతో రోడ్డుపై కూర్చున్న ఘటన చూస్తే పట్టాభిపురం పోలీసుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కేక్ కోసం వెళ్లి మృత్యు ఒడిలోకి...

- ముందు వెళ్తున్న ఆటో షడన్ బ్రేక్ వేయడంతో ప్రమాదం
- ఆటోను ఢీకొని రోడ్డుపై పడిన వారిపై దూసుకెళ్లిన లారీ
- ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- కొత్త సంవత్సరం వేళ కుటుంబంలో విషాదం



మృతుడు గంజనబోయిన కార్తీక్ (ఫైల్)

నకరికల్లు: నూతన సంవత్సరం వేళ ఓ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. లారీ మృత్యువు రూపంలో వచ్చి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని త్రిపురాపురం గ్రామం సమీపంలో అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... త్రిపురాపురం గ్రామానికి చెందిన గడిబోయిన దుర్గారావు తన ద్విచక్రవాహనంపై గంజనబోయిన కార్తీక్ (11)ను ఎక్కించుకొని నకరికల్లుకు కేక్ కోసం బయలుదేరారు. గ్రామం నుంచి అద్దంకి-నార్కట్ పల్లి రాష్ట్ర రహదారిపైకి చేరుకొని కొద్దిదూరం వెళ్లేలోగానే బైక్ కన్నా ముందుగా వెళ్తున్న ఆటో షడన్ బ్రేక్ వేయడంతో ఆటోను బైక్ ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడిపోయారు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న లారీ కార్తీక్ (11)పై నుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న దుర్గారావుకు తీవ్రగాయాలు కాగా నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. ప్రమాదఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

ఒక్కగానొక్కడు..


త్రిపురాపురం గ్రామానికి చెందిన వెంకటేష్, నాగమణి దంపతులకు కొడుకు, కుమార్తె ఉన్నారు. కార్తీక్(11)పెద్దవాడు. నకరికల్లులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. నూతన సంవత్సరం కావడంతో కేక్ తీసుకొని వచ్చాక పాఠశాలకు వెళ్తానని ఇంటి పక్కన వ్యక్తి బైక్‌పై బయలుదేరిన కొద్దిసేపటికే మృత్యు కబళించింది. తమ ఒక్కగానొక్క కుమారుడు లేడన్న వార్తతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

మంచుతో అప్రమత్తంగా ఉండండి

చలికాలం కావడంతో మంచు తీవ్రంగా ఉందని వాహనాలు అప్రమత్తంగా ఉండి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని ఎస్ చల్లా సురేష్ సూచించారు. వేకువజామున సాధ్యమైనంత మేర ప్రయాణాలు తగ్గించుకోవాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

చల్లా సురేష్, ఎస్ఐ

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 571.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 8,604 క్యూసెక్కులు వదిలారు.

మెరుగైన పోలీసింగ్‌తో నేరాలు తగ్గుదల

- జిల్లాలో 661కేసుల్లో శిక్షలు
- హత్యలు పది శాతం పెరుగుదల
- 55 శాతం ప్రాపర్టీ రికవరీ
- ఇంకా రోడ్డు ప్రమాదాలు, నేరాలు తగ్గేందుకు కృషి చేస్తాం
- వార్షిక నివేదిక వెల్లడించిన జిల్లా ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: పోలీస్ శాఖలో సమర్థమైన సిబ్బంది పనితీరు, మెరుగైన పోలీసింగ్‌తో గతంతో పోలిస్తే ఈ ఏడాది నేరాలు తగ్గాయని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వార్షిక వివరాలను వెల్లడిస్తూ మాట్లాడారు. 2022లో మొత్తం 4712 కేసులు, 2023లో 4578 నమోదుకాగా, 2024లో 4,222కేసులు నమోదయ్యాయని అన్నారు. అంతకు ముందు ఏడాదితో పోల్చితే 2023లో 133, 2024లో 356 కేసులు తగ్గాయని చెప్పారు. గత ఏడాదితో పోల్చితే నివేదించబడిన కేసులలో 7.7శాతం తగ్గుదల కన్పిస్తుందన్నారు. పోలీసింగ్‌లో విన్నూత్న ఒరవడిని సృష్టించడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. రెట్టింపు ఉత్సాహంతో మరింత మెరుగైన పోలీసింగ్‌ను అందిస్తామని ఎస్పీ వెల్లడించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు పడ్డాయన్నారు. ఈ ఏడాది పల్నాడు జిల్లాలో 661 కేసులలో నిందితులకు శిక్షలు ఖరారు అయ్యాయన్నారు. హత్య కేసులు 2022లో 37 జరగ్గా, 2023లో 40 కేసులు, 2024లో 44 కేసులు నమోదై 10శాతం పెరుగుదల కన్పిస్తుందన్నారు. నాలుగు కేసుల్లో జీవిత ఖైదు కోర్టుల విధించాయన్నారు. ప్రాపర్టీ కేసులు 2022లో 603, 2023లో 344, 2024లో 520 కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఈ ఏడాది 55 శాతం ప్రాపర్టీ రికవరీ చేశామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలతో రోడ్డుప్రమాదాలు తగ్గాయన్నారు. ప్రతినెలా ప్రమాదలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, స్టాప్ బోర్డులు ఏర్పాటు, నిరంతర వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్, ప్రత్యేక అవగాహన సదస్సులు, ట్రాఫిక్ ఎన్ ఫోర్స్‌మెంట్ పెద్ద ఎత్తున పెంచడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించామన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు 2022లో 86, 2023లో 106, 2024లో 236 కేసులు నమోదయ్యాయని చెప్పారు. మహిళలపై నేరాలు పరిశీలిస్తే 2022లో 713, 2023 274, 2024లో 502 కేసులు నమోదయ్యాయని, 2023 నుండి 2024 మధ్య 230 కేసులు పెరిగాయని ఎస్పీ పేర్కొన్నారు. పోక్సో చట్టం కేసులు 2022, 81, 2023 29, 2023లో 50 కేసులు నమోదయ్యాయని, 2023తో పోల్చితే 21 పెరిగాయని చెప్పారు. మహిళలు, చిన్న పిల్లలపై నేరాలకు పాల్పడే వారిపైన కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. డీఎస్పీ, ఎస్పీ స్థాయి అధికారుల స్వీయ పర్యవేక్షణలో కేసు యొక్క విచారణ సమయాన్ని ఘణనీయంగా తగ్గించి స్వల్పకాల వ్యవధిలోనే నేరానికి పాల్పడిన వారికి జీవిత ఖైదు అంతకంటే ఎక్కువ శిక్షలు పడేవిధంగా చేశామన్నారు. ఈఏడాది ఆరు కేసులలో నిందితులకు జీవిత ఖైదు పడిందన్నారు. సైబర్ క్రైమ్, ఐటీ చట్టం కేసులు 2022లో 27, 2023లో 20 కేసులు, 2024లో 60 కేసులు నమోదయ్యాయని చెప్పారు. పల్నాడు జిల్లాలో గతంలో ఫ్యాక్షన్ ఎక్కువగా ఉండే గ్రామాలను గుర్తించి ఆ గ్రామాల్లో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు నిరంతరం నిఘా వుంచి ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామని చెప్పారు. నదీ పరివాహక ప్రాంతాలు, తండాలు, నల్లమల్ల అడవులకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా అడుగులు వేస్తూ తయారీదారులపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా క్రమం తప్పకుండా ఫుట్ పెట్రోలింగ్, పెట్రోలింగ్, బీట్స్ సంఖ్యను పెంచామని చెప్పారు. మీతో మేము ప్రోగ్రాం జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్లో డిజిటల్ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, నిఘాలో భాగంగా డిజిటల్ బారికేడ్లు, మూడు అధునాతన గస్తీ ద్విచక్ర వాహనాలను ప్రవేశపెట్టామన్నారు. ఏపీ ఫైబర్‌నెట్ ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల వలన పోలీసు విభాగానికి ఏదైనా ప్రయోజనం ఉందా అని సాక్షి ప్రశ్నించగా, కొన్నిచోట్ల ఆ కెమెరాలను వినియోగించుకుంటున్నామని ఎస్పీ చెప్పారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పరిపాలనా విభాగ అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పి సత్తిరాజు, డీఎస్పీలు కె.హనుమంతరావు, జగదీష్ పాల్గొన్నారు.









త్రికోటేశ్వరుడిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి వారిని సీఎం చంద్రబాబు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న సీఎంకు రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయ శాఖ కమీషనర్ సత్యనారాయణలు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. త్రికోటేశ్వర స్వామి వారికి చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నందీశ్వర మండపంలో ఆయనకు ఆలయ అర్చక స్వాములు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణ నుంచి కొండ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ అధికారులతో సమీక్షించారు. రోప్‌వే, రెండవ ఘాట్‌రోడ్డు, గిరిప్రదక్షిణ అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, చీఫ్‌విప్ జి.వి. ఆంజనేయులు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావు, కోడెల శివరామ్, పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

పర్యటన సాగిందిలా...

సామజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు ఉదయం 11 గంటలకు యల్లమంద గ్రామానికి చేరుకోవాల్సి ఉండగా 45నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. గ్రామశివారులో ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్దకు చేరుకున్న చంద్రబాబుకు ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దేవదాయ శాఖా మంత్రి ఆనం రామానారాయణరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, చీఫ్‌విప్ జీవీఎస్ ఆంజనేయులు, ఐజీ సర్వశ్రేష్ఠతిపాఠి, జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, బాష్యం రామకృష్ణ, జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనాతో పాటు టీడీపీ నాయకులు సీఎంకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని తలారి శారమ్మ నివాసానికి చేరుకుని ఆమెకు వితంతు పెన్షన్‌ను అందజేశారు. వారి కుటుంబసభ్యులతో కొంతసేపు ముచ్చటించారు. తరువాత మెయిన్‌రోడ్డులోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మరో లబ్ధిదారుడు ఉల్లంగుల ఏడుకొండలకు వృద్ధాప్య పెన్షన్‌ను పంపిణీ చేశారు. వీరి ఇంట్లో చంద్రబాబు స్వయంగా కాఫీ తయారు చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రేకుల షెడ్‌స్థానంలో ఆరు నెలలో సొంత ఇళ్లు నిర్మించి ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. అక్కడి నుంచి కోదండ రామస్వామి ఆలయానికి చేరకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో పలువురు పెన్షన్ లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 2.50 గంటలకు సభ ముగిసిన అనంతరం హెలీపాడ్ వద్దకు చేరుకుని జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. భోజన విరామం అనంతరం కోటప్పకొండకు చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు.



కోటప్పకొండలో సీఎం చంద్రబాబుకు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేదపండితులు

సోషల్ ఆడిట్‌లో అభ్యంతరాలు సమర్పించండి

షెడ్యూలు కులాల సంక్షేమాధికారి బీఎస్‌ఎన్ రావు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్‌లో భాగంగా జిల్లాలోని ఎస్సీల జనాభా, వారి వివరాల సేకరణపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే జనవరి 7వ తేదీలోగా గ్రామ, వార్డు సచివాలయాల్లో సమర్పించాలని జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమం, సాధికారిత ఇన్‌చార్జి అధికారి బీఎస్‌ఎన్ రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జనవరి 11 వరకు అభ్యంతరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి జనవరి 17న కులగణన పూర్తి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారన్నారు. కులగణనలో మూడుదశల్లో తనిఖీలు ఉంటాయని తెలిపారు. పేరు, ఆధార్‌నంబరు, పుట్టినతేదీ, వయస్సు, ఉపకులం, మరగుదొడ్డి, తాగునీటి సౌకర్యాలు, విద్య, వృత్తి, వ్యవసాయ వివరాలు సచివాలయంలో ప్రదర్శిస్తారన్నారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను సచివాలయంలో వీఆర్వో స్వీకరించి పరిశీలించి మండల ఆర్‌ఐకి సమర్పిస్తారన్నారు. ఆర్‌ఐ పరిశీలించి తహసీల్దార్‌కు సిఫార్సు చేస్తారని, వాటిని పరిశీలించిన తహసీల్దార్ పోర్టల్‌లో పొందుపరుస్తారన్నారు. ఈ వివరాల ఖచ్చితత్వం పరిశీలించేందుకు 50 మంది వివరాలను ర్యాండమ్‌గా తనిఖీచేస్తారన్నారు. ఈ సోషల్ ఆడిట్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, ఆర్డీఓలు, జిల్లా షెడ్యూలు కులముల అధికారి పర్యవేక్షిస్తారని, దీనిని ఎస్సీలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలువలోకి దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం

సీఐ అప్రమత్తతతో దక్కిన ప్రాణాలు

తాడేపల్లి రూరల్: ఓ వివాహిత కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడే విధుల్లోన ఉన్న సీఐ అప్రమత్తం కావడంతో ప్రాణాలతో బయటపడింది. తాడేపల్లి రూరల్ పరిధిలోని కృష్ణానది ఎగువ ప్రాంతంలో అమరావతి కరకట్ట వెంబడి కృష్ణానదికి అనుసంధానంగా ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జిపై నుంచి మంగళవారం ఆమె దూకింది. అక్కడే కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వద్ద మంగళగిరి సీఐ వినోద్ కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. కృష్ణానదిలో చేపలు పడుతున్న మత్స్యకారులను సీఐ వెంటనే పిలిపించారు. ఆమెను కాపాడి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆమె వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన మహిళగా గుర్తించి, బంధువులకు అప్పగించారు.

వేలిముద్రలు పడలేదని పింఛన్ ఎగవేత

పెదకాకాని: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారి సంఖ్యను తగ్గించే పనిలో నిమగ్నమైంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో టీములు ఏర్పాటు చేసింది. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించే ప్రక్రియ చేపట్టారు. తాజాగా పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన కరణం లక్ష్మమ్మకు పింఛన్ ఇవ్వడానికి వెళ్లిన సచివాలయ ఉద్యోగులు.. వేలిముద్రలు పడటం లేదని డబ్బులు ఇవ్వకుండానే తిరిగి వచ్చేశారు. వాస్తవానికి పెద్ద వయస్సు ఉన్న వారి వేలిముద్రలు అరిగిపోయి పడకపోతే ఐరిస్, టెకీకో ద్వారా పింఛన్ ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం 96 సంవత్సరాల వయస్సు ఉన్న కరణం లక్ష్మమ్మ ఒంటరిగా ఉంటున్నారు. ఎటువంటి ఆస్తులు లేవు. బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ జరిగి ఒక కన్ను చిన్నదిగా మారడంతోపాటు మూతి కూడా వంకర పోయింది. ఈ పరిస్థితిలో వేలిముద్రలు పడలేదని పింఛన్ ఇవ్వకపోతే ఎలా బతకాలని లక్ష్మమ్మ రోదిస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి వృద్ధురాలికి పింఛను అందజేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలి

గుంటూరు రూరల్: రైతులు ఎదుర్కొనే సమస్యలకు శాస్త్రవేత్తలు పరిష్కారం చూపాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ, మార్కెటింగ్, కోపరేషన్) బి. రాజశేఖర్ కోరారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నగర శివారులోని లాంఫాం నందున్న ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. బి. రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, శాస్త్రవేత్తలతో చర్చ గోష్ఠి నిర్వహించారు. ఇతర ప్రాంతాల వారు వర్చువల్‌గా పాల్గొన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ... అన్నదాతలు నూతన పద్ధతుల్ని ప్రోత్సహించేలా ప్రణాళికలను రూపొందించాలన్నారు. సమాజంలో చదువుకు ఉన్న విలువ తదితర విషయాలను విద్యార్థులతో చర్చించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీని విశ్వవిద్యాలయం అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ, డీన్ ఇంజినీరింగ్ డాక్టర్ ఎ.మణి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివనారాయణ, సీఓఈ డాక్టర్ డి.సంపత్‌కుమార్, కంట్రోలర్ డాక్టర్ బీవీఎస్ ప్రసాద్, ఎస్టేట్ ఆఫీస్ డాక్టర్ పి.రవి, డాక్టర్ పి.సాంబశివరావు పాల్గొన్నారు.





నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు కార్యాలయం పరిధిలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 44 కాంట్రాక్టు స్టాఫ్ నర్సు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఉద్యోగాలకు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్వైఫరీ, బీఎస్సీ నర్సింగ్ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను జనవరి 17 నుంచి 23వ తేదీలోపు పరిశీలించి, 24న మెరిట్ లిస్టు, 29న ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేయాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కె.పద్మావతి ఆదేశాలు జారీ చేశారు. కౌన్సెలింగ్ జనవరి 30, 31వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి, ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేయాలని వెల్లడించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తెనాలి జిల్లా ఆసుపత్రిలో ఆరు పోస్టులు, బాపట్ల ఏరియా ఆసుపత్రిలో పది, నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో 24, ఆత్మకూరు, కందుకూరు, రాపూరు, గురజాలలో ఒక్కొక్కటి చొప్పున స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.









